RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 272 | సెప్టెంబర్ 30, 2025 | వెల : రూ.3-00



**బతుకమ్మ ఘాట్‌ను పరిశీలించిన ఎంపీడీవో**

2లో..

# తల్లి ప్రేరణతో తనయుడి విజయం



- మట్టిలో మాణిక్యం వాంకుడోతు సురేశ్
- యువతకు ఆదర్శంగా నిలిచిన యువకుడు
- మారుమూల పల్లె నుంచి గ్రూప్1 ఆఫీసర్‌గా ఎదిగిన యువకెరటం

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

పట్టుదల, అకుంఠిత దీక్ష, ఆత్మవిశ్వాసం ఉంటే చాలు.. అనుకున్న లక్ష్యాన్ని ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా సాధించొచ్చని నిరూపించారు ఓ యువకుడు. మారుమూల పల్లెలోని నిరుపేద కుటుంబం నుంచి వచ్చి పోటీ ప్రపంచంలో తన కాళ్లపై తాను నిలబడి గ్రూప్-1లో 572వ ర్యాంకు సాధించి.. స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు. ఆయన రేగొండ మండలం జగ్గయ్యపేటలో పంచాయతీ కార్యదర్శిగా 2019 వరకు విధులు నిర్వర్తించారు.

**- సురేశ్‌కు అండగా నిలిచిన కుటుంబం, దోస్తులు**

భూపాలపల్లి మండలంలోని చికెన్‌పల్లి గ్రామానికి చెందిన వాంకుడోత్ సురేశ్ గ్రూప్-1 పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఎంపీడీవో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. మండలంలోని చికెన్‌పల్లి గ్రామానికి చెందిన వాంకుడోత్ కమల, రామస్వామి దంపతులకు 10-07-1993లో వాంకుడోతు సురేశ్ జన్మించారు. సురేశ్ ఎనిమిదో ఏటనే తండ్రి రామ స్వామి అనారోగ్యానికి గురై మృతి చెందాడు. దీంతో తల్లి కమల.. సురేశ్ అతని సోదరుడిని అన్నీ తానై పెంచి పోషించి చదివించింది. సురేశ్ గొల్లబుద్దారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేశాడు. అనంతరం హనుమకొండలోని సహారా జూనియర్ కళాశాలలో ఇంటర్, ఎస్సార్ విద్యాసంస్థల్లో బీటెక్ పూర్తి చేశారు. ఈ క్రమంలోనే 2020లో తల్లి కమల మృతి చెందింది. సురేశ్ తన తోటి మిత్రుల సాయంతో హైదరాబాద్‌లో యూపీఎస్సీ కోచింగ్ తీసుకుని గ్రూప్-1 పరీక్ష రాసి సెప్టెంబర్ 25న విడుదలైన ఫలితాల్లో 572వ ర్యాంకు సాధించి ఎంపీడీవో ఉద్యోగానికి సెలెక్ట్ అయ్యాడు.

**- గ్రూప్-1 విజయం తల్లికి అంకితం చేసిన సురేశ్**

తల్లి ఇచ్చిన స్ఫూర్తితో ముందుకెళ్లారు సురేశ్. మొక్కవోని దీక్షతో పరీక్షలకు సన్నద్ధమయ్యారు. తన చిన్నతనంలో తన మాతృమూర్తి తన కొడుకు కలెక్టర్ అవ్వాలని కోరుకుందని, ఈ క్రమంలోనే తాజాగా గ్రూప్-1 కొలువు సురేశ్ సాధించి..ఉన్న ఊరు, కన్నతల్లి పేరు నిలబెట్టారు. మట్టిలో మాణిక్యం మాత్రమే కాకుండా యువతకు స్ఫూర్తి ప్రదాతగా సురేశ్ నిలిచారు. గ్రూప్-1 సాధించిన సందర్భంగా ఈ విజయాన్ని తన తల్లికి అంకితం చేస్తున్నట్టు సురేశ్ పేర్కొనడం విశేషం. తన మాతృమూర్తి కష్టఫలితంగా, దీవెనగా ఈ ఉద్యోగం లభించినట్టు భావిస్తున్నానని వెల్లడించారు. తన విజయానికి తన సోదరుడు వి నరేశ్ సైతం మద్దతుగా నిలబడ్డారని పేర్కొన్నారు.

**- తండ్రి మాదిరిగా అరవింద్ మద్దతు**

తన విజయంలో మరో కీలక భూమిక పోషించిన వ్యక్తి తన స్నేహితుడు ఎన్ అరవింద్ అని సురేశ్ వెల్లడించారు. సాధారణ దోస్తుగా పరిచయమైన అరవింద్ తనను తండ్రి మాదిరిగా ప్రోత్సహించాడని, ఆర్థికంగా, హార్ధికంగా, మోరల్‌గా మస్తు మద్దతు ఇచ్చారని స్పష్టం చేశారు. అరవింద్‌తో పాటు తన బీటెక్ కాలేజీ వరదారెడ్డి కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ మిత్రులు కూడా కష్టకాలంలో తనకు అండగా నిలిచారని సురేశ్ చెప్పారు.

**- లక్ష్యసాధనలో నిమగ్నమై..**

పువ్వు పుట్టగానే పరమళిస్తుందనే రీతిలో.. తొలి నుంచి చదువులో సురేశ్ రాణించారు. తను పుట్టి పెరిగిన ఊరుతో పాటు కుటుంబం గర్వించేలా జీవితంలో ముందుకెళ్లాలని నిర్ణయించుకున్నాడు. అందుకు అనుక్షణం శ్రమిస్తూ.. లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగి విజేతయ్యాడు. గొల్లబుద్దారంలోని జెడ్పీ సెకండరీ స్కూల్‌లో స్కూలింగ్ పూర్తి చేశాడు సురేశ్.

**- ఐఏఎస్ కావడం నా లక్ష్యం: వి సురేశ్**

నేను గ్రూప్-1 కొలువు సంపాదించడంలో కుటుంబ సభ్యులు, స్నేహితుల సహకారం మరువలేనిది. విద్యతో సమాజంలో మార్పు అనివార్యంగా వస్తుందని నేను భావిస్తున్నా. సొసైటీ ప్రగతి పథంలో సాగాలంటే విద్యనే ఆయుధమని నేను నమ్ముతాను. అక్షరాస్యతతో ఆటోమేటిక్‌గా అభివృద్ధి వైపు పయనం సాగుతుంది. నా లక్ష్యం ఐఏఎస్ కావడమే. ఏ పని అయినా క్రమశిక్షణ, శ్రద్ధతో చేస్తే మీరు అనుకున్నది తప్పక సాధిస్తారు. క్రమశిక్షణ, ఓపికతో చేసే పనికి భగవంతుడు సాయం చేస్తాడని నేను నమ్ముతాను. అయితే, నా విషయంలో ఆ మేరకు భగవంతుడి రూపంలో నాకు సాయం చేసింది స్నేహితులేనని నేను భావిస్తాను. నేను సొంతంగా ప్రతి సబ్జెక్ట్‌కు సిలబస్ వైజ్‌గా నోట్స్ ప్రిపేర్ చేసుకున్నారు. యూపీఎస్సీకి, గ్రూప్-1 లో విజయం సాధించాలంటే టెస్ట్ సిరీస్ ప్రాక్టీస్ అత్యావశ్యకం.

## రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా..?



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. పట్టపగలే చుక్కలు చూస్తున్నారు. వర్షకొండ నుండి ఇబ్రహీంపట్నం వెళ్లే రోడ్డు ఉపరితలం దెబ్బతిని లోతైన గుంతలు ఏర్పడ్డాయి. దీని వల్ల వాహనదారులు ప్రయాణంలో తీవ్ర ఇబ్బందులు పడటమే కాకుండా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ముఖ్యంగా వర్షాకాలం గుంతలలో నీరు చేరి పంచాయతీ రోడ్డు మరింత అధ్వానంగా మరుతుంది. మండల కేంద్రానికి వెళ్లే మార్గం కాబట్టి ప్రస్తుత పరిస్థితిలో రైతులు ధాన్యం మక్కలు ట్రాక్టర్ లారిలో వేసుకొని రోడ్డు పై వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని, స్థానిక రైతులు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగలు, రాత్రి, తేడా లేకుండా భయంతో ఆ దారిలో ప్రయాణం. దిన దిన గండంగా మారింది. రోడ్డు ఇంత పాడయి ఉన్నప్పటికీ ఏ అధికారులు స్పందించిన దాఖలాలు లేవని గ్రామ ప్రజలు అంటున్నారు. సాధారణ పౌరులకు ఏమైనా అనుకోరాని అపాయం జరిగితే దానికి బాధ్యులేవరని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించే తీరుపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలంటే మీకంత చులకన అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌బి, పంచాయతీ, ఉన్నత అధికారులు స్పందించి రోడ్డుపై ఎర్పడిన గుంతలను మరమత్తులు చేయించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

## స్థానిక సమరానికి బీజేపీ సై

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై ప్రజలు విసిగిపోయారు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై రాంచందర్ రావు విమర్శలు
- ఎన్నికలను ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేశారని ఆరోపణ

4లో..

## కాంపౌండ్ వాల్ పనులను వేగవంతంగా పూర్తి చేయండి

**- కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

**వేద న్యూస్, వరంగల్ :**

కాంపౌండ్ వాల్ నిర్మిత పనులను వేగవంతంగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం హన్మకొండ లోని వెహికల్ షెడ్ ప్రాంతం లో నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్ నిర్మిత పనులతో పాటు సమీపం లో గల రెండు పడకల గదులు సముదాయం (2 బి హెచ్ కే) లో నీటి సరఫరా వసతి కల్పన కోసం చేయాల్సిన ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హన్మకొండ లోని బాల సముద్రం లో గల వెహికల్ షెడ్ ప్రాంతం లో బల్దియా నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం అదే ప్రాంతం లో గల రెండు పడకల గదులు సముదాయం లో క్షేత్ర స్థాయిలో సందర్శించి ప్రస్తుతం నివాసం ఉంటున్న వారికి నీటిని వినియోగించుకోవడానికి వీలుగా సంయుక్తం గా సంప్ ఉందని అట్టి సంపు నకు కార్పొరేషన్ నీటిని సరఫరా చేస్తుందని సంపు నుండి వాటర్ ట్యాంక్ నకు వాటర్ ను పంపించాల్సిన అవసరం ఉందని అట్టి పనులను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. ఇదే ప్రాంతం లో డ్రైనేజీ వ్యవస్థను కమిషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమం లో ఏం హెచ్ ఓ డా.రాజేష్,ఈ ఈ రవి కుమార్,డి ఈ లు రాజ్ కుమార్, రాగి శ్రీకాంత్, సానిటరీ సూపర్ వైజర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



## నీట మునిగిన ఎంఈఓ కార్యాలయం..!

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**



రెండు రోజుల నుంచి ఎడతెరిపిలేని వర్షం నేపథ్యంతో వేములపల్లి ఎంఈఓ కార్యాలయం నీట మునిగింది. ఎంఈఓ కార్యాలయం గుంతల మయంగా దర్శన మిస్తుంది. ప్రతిరోజు కార్యాల యానికి వచ్చే అధికారులు, విద్యార్థులు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. కార్యాలయ ప్రదేశంలో వర్షపు నీరు చేరడంతో దోమల బెడదతో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు బారినపడే అవకాశం లేకపోలేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. పారిశుద్ధ్యం వికటించి రోగాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఎంఈఓ కార్యాలయానికి నిధులు మంజూరు చేసి మట్టి పోయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

**- రంగురంగుల పూలతో బతుకమ్మలు - పసుపు ముద్దకు ప్రత్యేక పూజలు**

**వేద న్యూస్, నల్గొండ ప్రత్యేక ప్రతినిధి :**



వేములపల్లి మండల వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. రంగురంగుల పూలతో పేర్చి మహిళలంతా ఒకచోటకు చేరి పసుపు ముద్దకు ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ప్రతి ఒక్కరు బతుకమ్మను పేర్చి కుటుంబ సమేతంగా పాల్గొని బతుకమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రకృతితో

మిగతా 3వ పేజీలో..

## తెలంగాణలో మోగిన స్థానిక ఎన్నికల నగారా

**- అక్టోబర్ 9 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం - మొత్తం ఐదు దశల్లో ఎన్నికల పోలింగ్ నిర్వహణ**

**వేద న్యూస్ డెస్క్:**

తెలంగాణలో పల్లె పోరుకు రంగం సిద్ధమైంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ప్రకటించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు వెల్లడించింది. మొత్తం ఐదు దశల్లో ఈ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని స్పష్టం చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాణి కుముదిని ఎన్నికల

మిగతా 3వ పేజీలో..



వేద న్యూస్

మంగళవారం సెప్టెంబర్ 30, 2025

## పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

**వేద న్యూస్, శాయంపేట:**

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శాయంపేట మండలం మైలారం గ్రామంలో చోటుచేసుకుంది. శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం మైలారం గ్రామానికి చెందిన ఐతం తిరుపతి వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు .వ్యవసాయం కోసం చేసిన అప్పులు పెరుగుపోవడంతో గత కొద్ది రోజులుగా మానసికంగా బాధపడుతూ బుధవారం రోజున తన భార్యతో పొలం కాడికి వెళ్ళొస్తానని చెప్పి వెళ్లిన ఐతం తిరుపతి గడ్డి మందు తాగి తన కుమారునికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా పొలం కాడికి వెళ్ళిన తోటి రైతులు ఐతం తిరుపతి గడ్డి మందు తాగినట్లు గుర్తించి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడని మృతుడి భార్య ఐతం సమత ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు.

## బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ఎం.హరిత



– శుభాకాంక్షలు తెలిపిన అదనపు కలెక్టర్, జిల్లా అధికారులు

**వేద న్యూస్,రాజన్న సిరిసిల్ల:**

జిల్లా కలెక్టర్ గా ఎం హరిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా సమీకృత కార్యాలయానికి రాగా, అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తన ఛాంబర్ లో కలెక్టర్ ఎం హరిత బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, అధికారులు, సిబ్బంది కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఏఓ రాంరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య..!

**వేద న్యూస్,శాయంపేట:**

ఉద్యోగం రావడంలేదని మనస్థాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శాయంపేట మండలంలోని నరసింహులపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం శాయంపేట మండలంలోని నర్సింహులపల్లి గ్రామానికి చెందిన ముస్కు మల్లయ్య కుమారుడు ముస్కు హరీష్ (26) గత రెండు సంవత్సరాల క్రితం బీటెక్ పూర్తి చేసి ప్రైవేట్ ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేయగా ఉద్యోగం రానందున మనస్థాపం చెంది ఈనెల 24వ తేదీన పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం పరకాల లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు.

## బతుకమ్మ ఘాట్‌ను పరిశీలించిన ఎంపీడీవో

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**



ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండలో బతుకమ్మ ఘాట్‌ను ఎంపీడీవో మహమ్మద్ సలీం సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాలలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించుటకు తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అలాగే ప్రతి గ్రామంలో శానిటేషన్, వీధి దీపాల ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామా కార్యదర్శి,ప్రవీణ్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## రాంలీల ఉత్సవ కరపత్రం ఆవిష్కరణ



**వేద న్యూస్, చొప్పదండి:**

విజయదశమిని పురస్కరించుకొని చొప్పదండి హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా అక్టోబర్ 2న రాంలీల నిర్వహించేందుకై సన్నాహక సమావేశం నిర్వహించి, అనంతరం కరపత్రం ఆవిష్కరణ చేసారు. ఈ సందర్భంగా రాంలీలా ఉత్సవ సమితి కన్వీనర్ కటుకం మహేష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు డా. వడ్లూరి ఆంజనేయ రాజు, ముఖ్య అతిథులుగా ప్రముఖ సంగీత దర్శకులు హనుమాన్, మిరాయి సినిమాల ఫేమ్ గౌర హరి, రామబాణం సంధించడానికై సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి విచ్చేస్తున్నట్లు అదే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలతో ఈ కార్యక్రమానికి ప్రత్యేక శోభను తీసుకొచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కావున హిందూ బంధువులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయగలరని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు పడకంటి క్రిష్ణ, వ్యవస్థా ప్రముఖ్ చేపూరి సత్యనారాయణ, హిందూ ఉత్సవ సమితి కన్వీనర్ ఎన్నం మునిందర్, కో-కన్వీనర్లు మోలుమూరి రమేష్, బత్తిని ప్రశాంత్, గుండేటి శివశంకర్, మంచికట్ల మల్లేష్, చిలుకునూరి మహేష్ నాయకులు గుర్రం ఇంద్రసేనా రెడ్డి, ఇప్పనపెల్లి సాంబయ్య, మోగిలి మహేష్, సారయ్య, కిట్టు గౌడ్, చెట్ల రాంకిషన్, కొక్కుల కనకయ్య, గుర్రం ఆనంద రెడ్డి, రవీందర్ రెడ్డి, ఉడుత శంకరయ్య, వడ్లూరి సుధాకర్, సంగ నరేష్, దండే రవీందర్, మహేష్, అనుమండ్ల సత్యం, చల్ల అనూష్, పొన్నాల తిరుపతి, గుండేటి వెంకటరమణ, జిట్ట కుమార్, గుర్రం సమర్, అనుకారి సాయికృష్ణ, తాడూరి రామకృష్ణ శివ కృష్ణ, అర్థవెల్లి శ్రీనివాస్, జాగిరి రాజేందర్, సిరిపురం శ్రీనివాస్, అజయ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**




రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లం తకుంట మండలం కందిక ట్కూర్ గ్రామంలో బతుకమ్మ సంబరాలు చేసుకుంటున్న మహిళలు రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి మొదట వారి ఇంటి వద్ద బతుకమ్మను ఆడారు. అనంతరం మూల వాగు వద్ద ఏర్పాటుచేసిన బతుకమ్మ తెప్ప వద్దకు బారులు తీరి వాగులో ప్రవహిస్తున్న నీటితోపాటు తెప్పలో బతుకమ్మలను నిమజ్జనం చేసి పోయిరా గౌరమ్మ పోయిరా అంటూ పాటలు పాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. అంతకుముందు వారి ఇండ్లలో గౌరీ దేవిని పూజించిన ఆడపడుచులు పసుపు కుంకుమలు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. సనాతనంగా వస్తున్న సాంప్రదాయంలో భాగంగా నిమజ్జనానికి తమ వెంట తెచ్చుకున్న పిండి పదార్థాలను ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకున్నారు. మహిళలు స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కోలాటాలు,యువతుల దాండియా నృత్యాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

## హైమాక్స్ లైట్లు మాయం



**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి మండలం కొలిమికుంట గ్రామానికి చెందిన తొమ్మిదవ వార్డు లో ఐమాక్స్ లైటు ఏర్పాటు చేసి నాలుగు నెలలు గడవక ముందే ఆ లైట్లు మాయమై పోవడం పరిస్థితి పై బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు అమరగాని రాజ్ కుమార్ గౌడ్ స్పందించారు. నాలుగు నెలలు గడవకముందే అధికార పార్టీ నాయకులు, గ్రామపంచాయతీకి చెందిన కరెంటు డిపార్ట్మెంట్ వాళ్లతో కుమ్మకై హైమాక్స్ లైట్లు మాయం చేశారు. గత కొద్ది కాలం కిందట ఐమాక్స్ లైట్ ప్రారంభ%శీ% చేయడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి హడావిడిగా ఓపెన్ చేశారు. ఇప్పుడు 9 రోజులు బతుకమ్మ ఉత్సవాలు మహిళలు, పిల్లలు కలిసి బతుకమ్మ కోలాటలతో, ఆటపాటలతో ఆడుకుంటున్న తరుణంలో కొందరు కావాలని ఆటంకాలు ఏర్పడే విధంగా బతుకమ్మ ఉత్సాహాలు ఎలా నిర్వహిస్తారు అని, బతుకమ్మ ఆడే స్థలంలో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేసి కావాలని కొందరు లైట్లు మాయం చేశారని అమరగాని రాజు, ఆ వార్డు ప్రజలు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో చుక్క లచ్చయ్య, బూత్కూరి శంకరయ్య, బూత్కూరి రాములు, చుక్కల అజయ్, చుక్కల అనిల్, తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా మహాచండీయాగం




**వేద న్యూస్, సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి:**

దుర్గామాత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కుంకుమ పూజ కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట పట్టణం భగత్ సింగ్ నగర్ రెండవ రోడ్డు నందు నిర్వహించిన మహచండియాగం లో కాలనీ కుటుంబ సభ్యులు పాల్గొని యాగం నిర్వహించారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని యాగం నిర్వహించారు. అమ్మవారి 17వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారిని ప్రతిష్టించి కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. నేటి అమ్మవారి ప్రతిరూపం మహచండి అవతారం నిర్వహించారు. కాలనీ యువత, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి కి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సరస్వతి పూజ నిర్వహించి పిల్లలకు అమ్మవారి కృప కల్గి ఉన్నత చదువులు వర్ధిల్లాలని కోరుతూ భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు స్వర్ణ సింగ్, నిమ్మల వెంకన్న, గంజి సంతోష్, టీచర్ మధుసూదన్, టీచర్ లింగయ్య, రమేష్, సునీత, హేమలత, లక్ష్మి, రేణుక, పద్మ, పాల్గొన్నారు.


## ముగిసిన మొదటి రోజు విచారణ

**డెస్క్ :** తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా మారిన ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు మొదటి రోజు విచారణ ముగిసింది. ఇవాళ(సోమవారం) ఉదయం 11 గంటల నుంచి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చాంబర్లో విచారణ కొనసాగింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేల తరుపు న్యాయ వాదులు పిటిషన్ దారులను క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. విచారణకు పిటిషనర్లు కల్వకుంట్ల సంజయ్, చింతా ప్రభాకర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, తరుపు న్యాయవాదులు హాజరయ్యారు. అలాగే.. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, కాలే యాదయ్య, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, వారి తరుపు న్యాయవాదులు విచారణలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ స్పీకర్‌కు పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. రోజులు గడుస్తున్న స్పీకర్ నిర్ణయం తీసుకోవడం లేదంటూ.. బీఆర్ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీంతో విచారణ చేపట్టిన న్యాయస్థానం కీలక ఆదేశాల జారీ చేసింది. ఈ నేపథ్యంలో పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. అయితే దానం నాగేందర్, కడియం శ్రీహరి మినహా మిగిలిన 8 మంది తాము పార్టీ మారలేదంటూ అఫిడవిట్ల పూర్వకంగా వివరణ ఇచ్చారు. ఫిర్యాదుదారులు కూడా వారికి వ్యతిరేకంగా ఆధారాలు సమర్పించారు.

## సరస్వతీ మాతగా శ్రీ భద్రకాళి అమ్మవారు

**వేద న్యూస్, వరంగల్ :**

వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధి గాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో శ్రీ భద్రకాళి దేవి శరన్నవరాత్ర మహోత్సవములు ఎనిమిదవ రోజుకు చేరుకున్నాయి. ఎనిమిదవ రోజు కార్యక్రమాలలో భాగంగా ఉదయం 4గంటలకు అర్చకులు నిత్యాహ్నికం నిర్వర్తించి అమ్మవారిని సరస్వతీమాతగా అలంకరించడానికి ఆంగీకార ప్రార్థన జరిపి సూచన వచ్చిన వెంటనే అమ్మవారిని సరస్వతీమాతగా అలంకరించి పూజారాధనలు నిర్వహించారు. సోమవారం అమ్మవారు సాధకుడి బుద్ధిలోకి ప్రవేశిస్తుంది. సరస్వతీ మాతగా అలంకరింపబడిన అమ్మవారి దర్శనం వల్ల సాధకుడికి సకల విద్యలు సమకూరుతాయని ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు తెలిపారు. సోమవారం అమ్మవారికి ఉదయం భద్రపీఠ సేవ సాయంకాలం అశ్వవాహన సేవ నిర్వహించారు. రేపు భద్రకాళి అమ్మవారి జన్మోత్సవం దుర్గ భద్రకాళిగా కోటి యోగిని గణములతో ప్రాదుర్భావం చెందిన రోజు. బతుకమ్మ కూడా దుర్గాష్టామినాడే జన్మించిందని ఆనాడే చద్దులు చేయడమనేది తరతరాలుగా వస్తున్న సంప్రదాయం. అనంతరం సాయంకాలం ఏర్పాటు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతో అలరించాయి.



# జీవవైవిధ్యంలో మార్పు ..పండుగలపై దాని ప్రభావం



మానవుని యొక్క స్వార్థంతో ప్రకృతికి వ్యతిరేకంగా నడుచుకుంటున్నాడు. తనకు కావాల్సిన విధంగా పకృతిని మార్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. ఈ పరిణామంలో నేలపై, జీవులపై, మొక్కలపై, గాలిపై, నీటిపై అనేక ప్రతికూల ప్రభావాలు పడుతూ కాలుష్యం ఏర్పడి పర్యావరణ సుస్థిరతకు భంగం వాటిల్లుతుంది. ఈ కాలుష్యాల ద్వారా మనిషి యొక్క జీవన విధానంలో, తన సంస్కృతిలోని మార్పు వస్తుంది. ముఖ్యంగా మనిషి సంతోషంగా ఉండటానికి కొన్ని తనకు నచ్చిన విధంగా జీవించడానికి మన పూర్వీకులు పండుగలను ఏర్పరుచుకున్నారు. అలాంటి తెలంగాణ పండుగలలో ప్రకృతిని, పువ్వులను ఆరాధించే పండుగలలో ఒకటి ఈ "బతుకమ్మ పండుగ."

బతుకమ్మ పండుగల రోజున ఉదయాన్నే స్నానం చేసి మగవారు, పిల్లలు అందరు సమూహంగా మరి అడవులకి గ్రామ పక్కన ఉన్న ఆ గ్రామం యొక్క చుట్టు పక్కల ఉన్నటువంటి కొండలపైకి, చిన్న చిన్న అడవిలోనికి, చెరువు గట్ల పైన ఉన్న చెట్ల, గుల్మాల పువ్వులను తెంపుకొని వచ్చేవారు. అలాంటి పువ్వులలో ముఖ్యమైనవి తంగేడు పువ్వు, తర్వాత గునుగు పువ్వు, సీతమ్మ పట్టుకుచ్చుల పువ్వు, అడవి చామంతి, రోకలిబండ,ముచ్చాల, కట్లాషా, బంతి, చాబంతి పువ్వులు అలాగే ముందుగా అడుగున వేయడానికి గుమ్మడి ఆకులు ఇలాంటివి తీసుకొని వచ్చి పండక్కి అమ్మగారింటికి (అవ్వగారింటికి) వొచ్చిన ఆడబిడ్డలతో ఇంట్లో ఆడ పిల్లలకి ఇస్తే వాటికి కొన్ని సహజ రంగులద్ది, గుమ్మడి ఆకులను వేసి పల్లాలలో, తపుకు, తంభాలంలో పేర్చుకుని బతుకమ్మగా చేసుకొని, అందులో పసుపుతో చేసిన గౌరమ్మను, అగరోతులతో అలంకరించి దూపదీప నైవేద్యాలిచ్చి ఆ రోజు సాయంత్రం వారందరూ ఊరికి దగ్గరలో కొత్తగా చేరిన నీటి చెరువులో, కుంటలో దగ్గర చేరి సంతోషంగా పండుగ బతుకమ్మ చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొడుతూ ఆడుకునేవారు, ఇప్పటికీ ఆడుకుంటున్నారు. ఆ తర్వాత తెచ్చిన ఫలహారము, పెరుగుతో కలుపుకుని తెచ్చుకున్న సద్ది ప్రసాదంగా పసుపు కుంకుమలతో ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకుని చివరగా బతుకమ్మను మగ పిల్లలతో చెరువుల్లో, కుంటల్లో నిమజ్జనం చేసి పోయిరావమ్మా బతుకమ్మ పోయిరావమ్మా అంటూ పాటలు పడుకుంటూ ఇంటికి సంతోషంగా ఒకరితో ఒకరు మాట్లాడుకుంటూ వెళ్లేవారు.

బతుకమ్మను పేర్చి కోవడానికి కావలసినటువంటి పువ్వుల్లో ముఖ్యమైనది తంగేడు పువ్వు, గునుగు పువ్వు సీతమ్మ కుచ్చు పువ్వు, అడవి చామంతి పువ్వు, రుద్రాక్ష, పువ్వు, తామర పువ్వు, రోకలి బండ పువ్వు, చామంతి పువ్వు, ముద్దబంతి పువ్వు, ముఖ్యమైన పూల జాతి మొక్కలు. ఈ మొక్కలు అంతరించిపోతున్న నందున మనకు బతుకమ్మ పువ్వులు దొరకటం లేదు. దానికి కారణం మారుతున్న పండుగల సంస్రకృతి, సంప్రదాయాలతోపాటుగా పర్యావరణ, ప్రకృతి విధ్వంసం.

మన సంస్కృతిని కాపాడే పండుగలు, మనం సంతోషంగా అందరిని కలిసి మెలిసి జీవించే విధంగా ఉండే ఇటువంటి పండుగలని కాపాడుకునేందుకు మన చుట్టూ ఉన్న ప్రకృతి అంటే గాలిని, నీటిని, భూమిని, ప్రకృతి విధ్వాంసం విధానాడుతూ వాతావరణ కాలుష్యం నుంచి కాపాడుకుని మన జీవన విధానాన్ని, మన సంస్కృతితో కూడిన పండుగల విశిష్టతలను, ప్రాషష్త్యాన్ని భావితరాలకు అందించే విధంగా మన భుజస్కందాలపై ఉన్నది కాబట్టి, మనం ప్రకృతిని ఆరాధిస్తూ, ఈ పండుగను ప్రకృతి సహేతుకంగా జరుపుకునే విధంగా జీవించాలి. అదేవిధంగా కనుమరుగైపోతున్న ఈ వృక్షజాతులు పూల మొక్కలు జీవవైవిధ్య వైవిధ్యంలో మార్పులను గమనిస్తూ మన ప్రకృతిని మనం కాపాడుకుందాం. పకృతి ని కాపాడే పర్యావరణాన్ని రక్షిద్దాం అదే మనల్ని తిరిగి రక్షిస్తుంది.

**– ఆడపిల్లలందరికి పువ్వుల పండుగ బతుకమ్మ శుభాకాంక్షలు.**

**– రవిబాబు పిట్టల, పర్యావరణవేత్త.**

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకి ప్రతీక బతుకమ్మ పండుగ



**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో గ్రామ గ్రామాన ఈ రోజు సద్దుల బతుకమ్మ పండుగను మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తూ, మహిళలు పువ్వులతో అలంకరించిన బతుకమ్మలను పూజిస్తూ, ఆటపాటలతో జరుపుకునే వేడుక బతుకమ్మ అన్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే పూల పండుగ ప్రతీ ఒక్కరి జీవితాల్లో సంతోషాలు విర బూయాలని ఆకాంక్షించారు. ఎంగిలి పూలతో ప్రారంభమై, సద్దుల బతుకమ్మతో శోభాయమానంగా ముగిసే ఈ తొమ్మిది రోజులు ఆడపడుచుల ఆనందంగా జరుపుకునే ఉత్సవమని తెలిపారు. గౌరమ్మతల్లి ని పూజిస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే ఈ పండుగలో భాగంగా పూలను సేకరించి, వాటిని అందంగా అలంకరించి బతుకమ్మను,పేర్చి, అట,పాటలతో, నృత్యాలతో మన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార, వ్యవహారాల్ని చాటి చెప్పే ప్రత్యేకమైన పండగ బతుకమ్మ. బతుకమ్మనే తల్లిగా భావించే సంస్కృతికి నిలువుటద్దంలా నిలుస్తుందీ వేడుక. ప్రకృతి నుంచి వచ్చే పూలను దేవతగా కొలిచేటువంటి అపురూప వేడుక బతుకమ్మ అన్నారు. ఇందులో భాగంగా తీరొక్కపూలను బతుకమ్మగా పేర్చి మహిళలంతా ఒక్కచోట చేరి జీవిత పాఠాలను పాటలుగా ఎంతో భక్తితో ఆలపిస్తారని అన్నారు.

# ప్రకృతితో మానవ అనుబంధాన్ని గుర్తుచేసే పండుగ బతుకమ్మ

**వేద న్యూస్, శేరిలింగంపల్లి :**



ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా ప్రకృతిని ఆరాధించే అతిపెద్ద పండుగ బతుకమ్మ అని భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని సురభి కాలనీలో బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భీమని విజయలక్ష్మి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ.. పూలు బాగా వికసించే కాలంలో, జలవనరులు సమృద్ధిగా పొంగి పొరలే సమయంలో భూమితో, జలంతో, మానవ అనుబంధాన్ని గుర్తుచేసే వినూత్నమైన పండుగ బతుకమ్మ అని అన్నారు. మహిళలు తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి, భయం మొదలైన అంశాలన్నింటినీ పాట రూపంలో ఆలపించే అద్భుత ఘట్టం బతుకమ్మ సొంతమని అన్నారు. ఈ పండుగ ఎలా మొదలైందో చెప్పడానికి అనేక కథలు ప్రాచుర్యంలో ఉన్నప్పటికీ బతుకమ్మ అంటే తెలంగాణ అస్తిత్వం అనడంలో మాత్రం అతిశయోక్తి లేదని అన్నారు. అనంతరం బతుకమ్మ వేడుకలో పాల్గొన్న మహిళలకు నిర్వాహకురాలు భీమని విజయలక్ష్మి పసుపు కుంకుమలతో పాటు చీరలను వాయినంగా అందజేశారు. తన ఆహ్వానాన్ని మన్నించి పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మహిళలకు ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చ నాయకురాళ్లు రాధ మూర్తి, పద్మ, రేణుక, మహేశ్వరి, కాంచన కృష్ణ, వినీత సింగ్, స్నిగ్ధ గాయత్రి, తో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

మమేకమై ఈ పండగను చిన్న పెద్ద లేకుండా ఉత్సాహంగా జరుపుకున్నారు. గునుగు, తంగేడు, బంతి, చామంతి,వంటి రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి..బతుకమ్మలను డీజే సౌండ్ లతో... ఆటపాటలతో సందడి చేసి చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబించేలా మహిళలు బతుకమ్మ పండుగను జరుపుకుంటారని పేర్కొన్నారు.సంస్కృతి సంప్రదాయాలకు తెలంగాణ పుట్టినిల్లు అన్నారు.ఆమనగల్లు గ్రామంలో ఘన%శీ%గా సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. బతుకమ్మ ఏర్పాట్లు చేసిన శ్రీ రామలింగేశ్వర దేవాలయ చైర్మన్ తాళ్ల వెంకటేశ్వర్లు మహిళలంతా ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు.

# బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మేయర్

**వేద న్యూస్, వరంగల్:**

సోమవారం సద్దుల బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ చిన్న వడ్డేపల్లి బండ్ పైన ఏర్పాటు చేసిన కార్యక్రమం లో కార్పొరేటర్ కావేటి కవిత తో కలిసి బతుకమ్మ సంబరాల్లో నగర మేయర్ గుండు సుధారాణి పాల్గొని మహిళలతో ఆడి పాడుతూ సంబరాలు చేసుకున్నారు. అనంతరం మేయర్ చిన్నవడ్డేపల్లి చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు నగర వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయని అన్నారు. తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలను ఇంచేలా పూలను పూజించి దేవతలుగా చూసుకొనే గొప్ప పండుగ బతుకమ్మ అని అన్నారు. పూలను పూజించి ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ అని ఇలాంటి సంస్కృతి మన తెలంగాణ లోనే ఉందన్నారు. గౌరీ మాత ఆశీస్సులు ఎల్లవేళలు ఉండాలని, ఈ పండుగను ప్రజలందరూ సుఖ ,సంతోషాలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుపుకోవాలని నగర ప్రజలకు మేయర్ శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు మేయర్ క్యాంప్ కార్యాలయం లో గునుగు,తంగేడు, తీరొక్కా పువ్వులతో భక్తిశ్రద్ధలతో భారీ బతుకమ్మను పేర్చి కార్యక్రమం లో మేయర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్ కావేటి కవిత, సురేష్ జోషి, మహిళలు,



బల్దియా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో మోగిన స్థానిక ఎన్నికల నగారా

వివరాలను వెల్లడించారు. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు, ఆ తర్వాత సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. అక్టోబర్ 9వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను రెండు దశల్లో నిర్వహిస్తామని, అక్టోబర్ 23న తొలి విడత, అక్టోబర్ 27న రెండో విడత పోలింగ్ ఉంటుందని వివరించారు. సర్పంచ్ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. తొలి విడత సర్పంచ్ ఎన్నికలకు అక్టోబర్ 17న నోటిఫికేషన్ విడుదల చేసి, అక్టోబర్ 31న పోలింగ్ జరుపుతామన్నారు. రెండో విడతకు అక్టోబర్ 21 నుంచి నామినేషన్లు స్వీకరించి, నవంబర్ 4న పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఇక మూడో విడతకు అక్టోబర్ 25న నామినేషన్ల ప్రక్రియ మొదలుపెట్టి, నవంబర్ 8న పోలింగ్ ఉంటుందని స్పష్టం చేశారు.

ఈ ఎన్నికల ప్రక్రియ మొత్తం ముగిసిన తర్వాతే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఫలితాలను ప్రకటిస్తామని రాణి కుముదిని వెల్లడించారు. రాష్ట్రంలోని 31 జిల్లాల పరిధిలోని 555 మండలాల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 5,749 ఎంపీటీసీ, 565 జడ్పీటీసీ స్థానాలకు పోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం 1.12 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎస్ఈసీ పేర్కొంది. రిజర్వేషన్లకు సంబంధించిన గెజిట్‌ను కూడా ఇప్పటికే విడుదల చేసినట్లు ఆమె తెలిపారు.



# పోయిరా బతుకమ్మ... మల్లొచ్చే యేడాది మళ్లీ రావమ్మా..

**వేద న్యూస్ :ఇల్లంతకుంట:**

**– ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ గ్రామంలో గ్రామపంచాయతీ వద్ద పోయిరా బతుకమ్మ.... మల్ల అచ్చే ఏడాది మళ్లీ రావమ్మా... అంటూ మహిళలు సద్దుల బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. తొమ్మిది రోజుల బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. గ్రామాలలో మహిళలు రంగు రంగుల పూలు గునుగు, తంగేడు ,పట్టుకుచ్చు, బంతి, చామంతి పూలతో బతుకమ్మలను భక్తి శ్రద్ధలతో పేర్చి మొదట వివిధ కూడళ్ల వద్ద బతుకమ్మను ఆడారు. అనంతరం వాగుల వద్ద, బతుకమ్మ తెప్ప వద్దకు బారులు తీరి వాగులో ప్రవహిస్తున్న నీటితోపాటు తెప్పలో బతుకమ్మలను నిమజ్జనం చేసి పోయిరా గౌరమ్మ పోయిరా అంటూ పాటలు పాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. అంతకుముందు వారి ఇండ్లలో గౌరీ దేవిని పూజించిన ఆడపడుచులు పసుపు కుంకుమలు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. సనాతనంగా వస్తున్న సాంప్రదాయంలో భాగంగా నిమజ్జనానికి తమ వెంట తెచ్చుకున్న పిండి పదార్థాలను ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకున్నారు. యువతుల దాండియా, కోలాటాలు, బతుకమ్మ పాటలతో చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మండలంలోని వివిధ గ్రామాలలో




సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

వేద న్యూస్

మంగళవారం సెప్టెంబర్ 30, 2025

# సంపాదకీయం

నదీనదాలు.. ప్రజోపయోగ నిధులు

నదుల సంరక్షణపై పోరాడిన బ్రిటీష్ కొలంబియాకు చెందిన నదుల సంరక్షణ సంస్కర్త మార్క్ ఏంజిలో స్ఫూర్తితో ఐక్యరాజ్యసమితి ఏటా సెప్టెంబర్ 4వ ఆదివారం ప్రపంచ నదుల దినోత్సవంగా జరుపుతున్నది. వందకు పైగా దేశాల్లో జరిగే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం నదులను కాలుష్యం నుండి కాపాడడం, వాతావరణంలో సంభవిస్తున్న అవాంఛనీయ మార్పులకు అడ్డుకట్టవేయడం. ఇప్పటికే దేశం లో నదీజలాల పంపిణీ విషయంలో అంతరాష్ట్ర వివాదాలు తలెత్తుతున్నాయి. ప్రాజెక్టుల నిర్మాణంలో అనేక అవాంతరాలు ఏర్పడుతున్నాయి. అధిక వర్షాలతో అపారమైన జలసంపద కడలి పాలై నిరుపయోగంగా మారుతున్నది. నదుల కాలుష్యం, ప్లాస్టిక్ వ్యర్థాల వలన అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. నదులు అంతర్ధానం కాకుండా, నదులను కాలుష్య రహితంగా మార్చి సాగునీటికి, తాగునీటికి లోటులేకుండా చేయాలి. విచ్చలవిడిగా సాగుతున్న ఇసుక తవ్వకాలు, మితిమీరిన నీటి వినియోగం, కాలుష్యం వలన భవిష్యత్తులో నదులు అంతరించే అవకాశముంది. వీటితోపాటు అడవులను నరికి వేయడం, వర్షాభావం, పర్యావరణాన్ని పట్టించుకోకుండా నిర్మించే ఆనకట్టల వల్ల నదులు నిర్జీవంగా మారే ప్రమాదం పొంచి ఉంది. గంగా నదీ కాలుష్య ప్రక్షాళన దాదాపుగా విఫలమైనది. యమునా నది కాలుష్యంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రపంచ మానవాళికి నదులు చేస్తున్న మహోపకారం మరువలేనిది. అపారమైన జలసంపదతో తులతూగే నదులను పరిరక్షించుకోవడం మన కనీస బాధ్యత. గతం వర్తమానంగా, వర్తమానం భవిష్యత్తుగా పరివర్తన చెందడం సహజ ప్రక్రియ. 'గతం గతః' అని, 'గతజలసేతు బంధనంబు..తగదు' అంటూ గత విషయాలను వదిలేస్తే వర్తమానం దుర్భరంగా, భవిష్యత్తు అంధకార బంధురంగా మారక తప్పదు. గతం వర్తమాన, భవిష్య కాలాలను శాసించే శిలాశాసనం. ఇప్పటి వరకు మనం నదుల విషయంలో, నదీ జలాల విషయంలో శ్రద్ధ చూపలేకపోయాం. గతంలో జరిగిన తప్పిదాలు ఇక ముందు పునరావృతం కారాదు. నదుల్లో నీరు వృథాగా పోవడం రాబోయే సంక్షోభానికి సూచనగా ఎంతోమంది జలవనరుల నిపుణులు దశాబ్దాల నుండి హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా పట్టించుకోని పాప ఫలితమే ప్రజలపాలిట శాపమై కూర్చుంది. ఇకనైనా నదీజలాల సక్రమ వినియోగం, నదుల సంరక్షణపై తగిన శ్రద్ధ వహించకపోతే రాబోయే కాలమంతా ప్రజలు తీవ్ర నీటిఇబ్బందులకు గురికాక తప్పదు. నదుల్లో కాలుష్యం అరికట్టకపోతే జలచరాలన్నీ అంతరించిపోగలవు. మానవవిజ్ఞానం ఎంత పెరిగినా, మనిషి హృదయం తరిగిపోయి, అత్యాశ పెరిగిపోయి తన పతనానికి తానే బాటలు వేసుకుంటున్నాడు. పచ్చదనం నశించింది, పర్యావరణం చెడింది. భూతాపం పెరిగింది. కాలుష్యం కట్టలు తెంచుకుని, వరద గోదారిలా జనజీవనాన్ని ముంచెత్తుతున్నది. నదులన్నీ తరిగిపోతున్నాయి. నదుల్లో కాలుష్యం తారస్థాయికి చేరింది. ఇంతటి విపత్తును మునుపెన్నడూ కనలేదు. మానవ మనుగడకు ఆధారమైన నదులను పరిరక్షించకపోతే భవిష్య పరిణామాలు ఊహాతీతంగా ఉంటాయి. నదులు ప్రకృతి ప్రసాదించిన వరం. నదులే నాగరికతకు చిహ్నాలు. నదీ తీరప్రాంతాల్లోనే జనజీవనం అధికం. ప్రపంచంలో ఎన్నో నదులున్నాయి. నైలు నది, మిసిసిపి, హెూయాంగ్ హెూ, అమెజాన్, కాంగో వంటి నదులు ప్రపంచంలో పేరొందిన నదులు. ఈజిప్టును నైలునదీ వరప్రసాదం అంటారు. ఈ నది ప్రక్కనే అనేక చారిత్రక కట్టడాలు వెలిసాయి. నదులు శక్తి వనరులు. సింధు నాగరికత, హరప్పా మెహంజదారో నాగరికత గురించి ప్రత్యేకంగా వివరించనక్కరలేదు. నదీసంపద నిలకడగా ఉంటే ఏ దేశ అభివృద్ధి అయినా స్థిరంగా ఉంటుంది. అలాంటి నదీజలసంపద కడలిపాలవుతున్నది. భారత దేశంలో నదులకు కొరతలేదు. జీవనదులు, వర్షాధార నదులతో భారత ఉపఖండం ప్రకృతి మాత ఒడిలో పూదండ లా రాణిస్తున్నది. భారత దేశంలో ఎన్నో నదులు, ఉపనదులున్నాయి. నదీ వ్యవస్థకు భారతదేశం పుట్టినిల్లు. అందుకే భారత్ ను 'లాండ్ ఆఫ్ రివర్స్' గా పిలుస్తారు. నదీ తీరంలో అరణ్యాలు, జంతుసంపద ఏర్పడుతున్నాయి. తాగునీటికి, రవాణాకు, మత్స్య సంపదకు నదులే సోపానాలు. జలవిద్యుత్, సాగునీటికి నదులే ఆధారాలు. నదుల వలన కలిగే ప్రయోజనాలు అపారం. నదులు ప్రకృతి సంపదలో ఒకభాగం. ఎక్కడైతే నదులు, నీటి ప్రవాహాలు ఉంటాయో, అక్కడే మానవ ఆర్థిక వికాసం వెల్లివిరుస్తుంది. నదులు, నీటి వనరులు లేక పోతే మానవ జీవనం దుర్భరం. అలాంటి నదులను కాలుష్యంతో నింపేస్తున్నాం. నదీ పరీవాహక ప్రాంతాల్లో వెలసిన గ్రామాలు, నగరాల వలన కాలుష్య సమస్య తలెత్తింది. వినియోగించిన నీటిని నదుల్లోకి శుద్ధి చేయకుండా వదిలేయడం, వాడి పారేసిన ప్లాస్టిక్ వంటి వ్యర్థ పదార్థాలను నదుల్లో వదలడం ఘోరం. దీనివలన నదీజలాలు కలుషితమైపోతున్నాయి. నదులనుండి సముద్రాల్లో కలిసే నీటి వలన సముద్ర జలాలు కలుషితం కావడం, సముద్ర జీవరాశులు చనిపోవడం, పర్యావరణ విధ్వంసం జరగడం భావ్యం కాదు. ఇలాంటి పరిస్థితులను నిలువరించి, నదులను పరిరక్షించాలనే ధ్యేయంతోనే ప్రతీ సంవత్సరం సెప్టెంబర్ చివరి ఆదివారం ప్రపంచ నదుల దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో నదుల సంరక్షణపై అనేక కార్యక్రమాలు ఏర్పాటవుతున్నాయి. ప్రజల్లో నదులపట్ల, నీటిపట్ల చక్కని అవగాహన కోసం జరిగే ఒక ముఖ్యమైన సందర్భమే ప్రపంచ నదుల దినోత్సవం. నదులను పరిరక్షించి ప్రపంచ మానవాళి మనుగడను కాపాడాలన్న ధ్యేయంతో జరిగే ప్రపంచ నదుల దినోత్సవం రాబోయే ఉపద్రవానికి అడ్డుకట్ట వేయాలి. నదుల పరిరక్షణ విషయంలో అశ్రద్ధను వీడి బృహత్తర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలి. ఏదిఏమైనప్పటికీ ప్రపంచ దేశాలన్నీ నదుల సంరక్షణ విషయంలో సమష్టి బాధ్యత వహించాలి.

# స్థానిక సమరానికి బీజేపీ సై..

**డెస్క్:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో, ఈ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరేయడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. అధికార కాంగ్రెస్‌తో పాటు గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కూడా ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, ఈ ఎన్నికల ఫలితాలు దానికి నిదర్శనంగా నిలుస్తాయని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రపతి, గవర్నర్ల పేర్లతో ఇప్పటివరకు ఎన్నికలను అనవసరంగా ఆలస్యం చేసిందని రాంచందర్ రావు విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ పాలనతో ప్రజలు విసిగిపోయారని, ఇప్పుడు రెండేళ్లలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా పూర్తి విరక్తితో ఉన్నారని ఆయన ఆరోపించారు. తమ పార్టీ విజయానికి బలమైన పునాదులు ఉన్నాయని రాంచందర్ రావు తెలిపారు. ప్రస్తుతం బీజేపీకి 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలతో పాటు ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నారని గుర్తుచేశారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు తాను ఇప్పటికే 23 జిల్లాల్లో యాత్రలు పూర్తి చేశానని, మరో నాలుగు జిల్లాల పర్యటన మిగిలి ఉందని వివరించారు. ప్రజల నాడిని బట్టి చూస్తే, స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడం తథ్యమని ఆయన జోస్యం చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఈరోజు విడుదల చేసిన షెడ్యూల్



ప్రకారం, రాష్ట్రంలో మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. ఆ తర్వాత గ్రామ పంచాయతీలకు సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహించనున్నారు.

# వేధింపులతో యువ డాక్టర్ ఆత్మహత్య

**డెస్క్:** మహారాష్ట్ర షిర్డీలో ఖమ్మం జిల్లాకు చెందిన డాక్టర్ ఆత్మహత్య చేసుకున్నాడు. బోనకల్ మండలం రాయన్నపేట గ్రామానికి చెందిన మరీదు వినోద్ (30) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రాయన్నపేట గ్రామానికి చెందిన మరీదు కిషోర్, కోటేశ్వరి దంపతులకు వినోద్ ఏకైక కుమారుడు.. వినోద్ ను ఉన్నతంగా చదివివించారు.. వినోద్ డాక్టర్ కావాలని కలలు కన్నాడు. రష్యాలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు.. ఆ తర్వాత షిరిడీలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ప్రస్తుతం పీడియాట్రిక్ లో వినోద్ ఎండీ కోర్సు చదువుతున్నాడు. మరో ఆరు నెలల్లో కోర్సు పూర్తి కానుంది.. ఈ నేపథ్యంలో మెడికల్ కాలేజీలో హెచ్ఓడీ, కొందరు సిబ్బంది వేధింపులు గురి చేయడంతో మనస్థాపానికి గురైన వినోద్.. తన రూమ్ లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తల్లి దండ్రులు కష్టపడి, అప్పులు చేసి ఎన్నో ఆశలతో కొడుకును ఎంబిబిఎస్ చదివించారు.. పీజీ కూడా పూర్తి చేయించి..డాక్టర్ గా చూడాలని వారు ఎన్నో కలలు కన్నారు.. ఇంతలోనే.. వారి ఆశలు అడియాశలయ్యాయి.. వినోద్ చిన్నతనం నుంచి చదువుల్లో మెరిట్ స్టూడెంట్.. అని.. చదువే లోకంగా ఉండేవాడని గ్రామస్థులు తెలిపారు. వినోద్ ను తరచూ అవమానాలకు గురిచేయ్యడంతోపాటు.. వేధింపులకు గురిచేయ్యడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడి మృతితో తల్లి దండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు..

# ట్రంప్ సుంకాలపై బ్రిక్స్ ఆందోళన

**డెస్క్:** వాణిజ్య భాగస్వామ్య దేశాలకు వ్యతిరేకంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలపై బ్రిక్స్ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. గాజాలో ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులను కూడా అవి గర్హించాయి. బ్రిక్స్‌తో పాటు భారత్-బ్రెజిల్-దక్షిణాఫ్రికాతో కూడిన ఐబీఎస్ఏ ఈ మేరకు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. పశ్చిమాసియాలో పెరుగుతున్న అస్థిరతపై ఆందోళన వ్యక్తం చేశాయి. ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఐబీఎస్ఏ తీవ్రంగా ఖండించింది. ఉక్రెయిన్ ఘర్షణను ప్రస్తావిస్తూ ఉద్రిక్తతలను నివారించాలని, శాంతిని స్థాపించాలని కోరాయి. అయితే బ్రిక్స్ తన తుది ప్రకటనలో ఉక్రెయిన్ ప్రస్తావన తీసుకురాకపోవడం గమనార్హం. న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం సందర్భంగా బ్రిక్స్ సభ్య దేశాల విదేశాంగ మంత్రులు




భేటీ అయ్యారు. ఈ సమావేశంలో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రసంగిస్తూ ప్రపంచంలో బహుపాక్షిక వాణిజ్య వ్యవస్థను పరిరక్షించాల్సిన అవసరం ఉన్నదని సభ్య దేశాలకు సూచించారు. నిర్మాణాత్మక మార్పుకు గొంతుకగా నిలవాలని కోరారు. ఏకపక్షవాదం, ఆర్థిక జాతీయతావాదం కారణంగా ఎదురయ్యే ప్రమాదాలపై హెచ్చరికలు చేశారు. 'పెరుగుతున్న రక్షణ వాదం, సుంకాల అస్థిరత, సుంకేతర అడ్డంకులు వాణిజ్యానికి అడ్డంకిగా మారుతున్నాయి. కాబట్టి బహుపాక్షిక వాణిజ్య వ్యవస్థను బ్రిక్స్ దేశాలు పరిరక్షించాలి' అని జైశంకర్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తెలిపారు. రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తున్నందుకు పాతిక శాతం టారిఫ్‌ను విధించడం సహా మొత్తంగా భారత వస్తువులపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 50 శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అల్లకల్లోలంగా ఉన్న ప్రపంచంలో శాంతి పరిరక్షణకు, చర్చలకు, దౌత్యానికి, అంతర్జాతీయ చట్టానికి కట్టుబడి ఉంటామని బ్రిక్స్ సందేశం ఇవ్వాలని జైశంకర్ సూచించారు.

# ఏథెన్స్‌లో కమ్యూనిస్టు పార్టీ ఫెస్టివల్‌కు భారీ స్పందన

**డెస్క్:** గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన ఫెస్టివల్‌కు భారీ స్పందన వచ్చింది. ఏథెన్స్‌లోని ట్రిట్సిస్ పార్కులో నాలుగు రోజులపాటు జరిగిన 51వ గ్రీస్ ఒడిగిటిస్ ఫెస్టివల్ ఆదివారంతో ముగిసింది. దీనిలో వేలాదిమంది యువకులు , కార్మికులు పాల్గొన్నారు. ఫెస్టివల్ ప్రధాన నినాదం " చిన్న నిప్పు రవ్వ పెద్ద అగ్ని జ్వాలగా మారుతుంది " యువతను



ఆకట్టుకుంది. ఆ ప్రాంతమంతా సోషలిజంకు సంబంధించిన బ్యానర్లు, నినాదాలతో నిండిపోయింది. కచేరీ వేదికలు, చర్చలు, ప్రదర్శనలు, సంస్కృతిని రాజకీయాలతో, కళను పోరాటంతో కలిపాయి. ఈ ఫెస్టివల్‌కు ప్రపంచవ్యాప్తంగా 35 దేశాలకు చెందిన యువ కమ్యూనిస్ట్, సామ్రాజ్యవాద వ్యతిరేక సంస్థలు హాజరయ్యాయి. ఉక్రెయిన్ , రష్యా, పాలస్తీనా, ఇజ్రాయెల్, టర్కీ, సైప్రస్‌లకు చెందిన యువకులు తమకు హద్దులు తెలియదని చాటిచెప్పారు. క్యూబా, పాలస్తీనా రాయబారులు, అంతర్జాతీయ కార్మిక సంఘాల ప్రతినిధులు, కమ్యూనిస్ట్ మేయర్లు, సాంస్కృతిక వ్యక్తులు ఈ వేడుకలో పాల్గొన్నారు. గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటి కార్యదర్శి థోడోరిస్ కొట్సొంటిస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పోరాటాల్లో యువత బలాన్ని నొక్కిచెప్పారు. ఈ ఫెస్టివల్ చరిత్రలో కొత్త పేజీలు రాస్తుందన్నారు. గ్రీస్ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక బిల్లును ఖండించారు. 13 గంటల బానిసత్వానికి కార్మికులు సిద్దంగాలేరని , 21వ శతాబ్దంలో రోజుకు 7 గంటలు, వారానికి 5 రోజులు, 35 గంటలు, జీతాల పెంపునకు పార్టీ పోరాడుతుందన్నారు. ఇజ్రాయిల్‌కు గ్రీక్ ప్రభుత్వ సహకారాన్ని ఖండిస్తూ, తూర్పు జెరూసలేంను రాజధానిగా కలిగిన 1967 సరిహద్దుల్లో పాలస్తీనా దేశాన్ని వెంటనే గుర్తించాలని డిమాండ్ చేశారు. ఫెస్టివల్ వేదిక నుంచి అక్టోబర్ 1న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్మికులు, యువత, విద్యార్థులు, నిరుద్యోగులు పరిశ్రమలను మూసేయాలని, ఆధునిక బానిసత్వానికి వ్యతిరేకంగా తమ గొంతులను వినిపించాలని కోరారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073